
సాక్షి కాకినాడ

శనివారం । 20 । మే । 2023



రూ.1,00,116 విరాళం

ఆత్రేయపురం: ర్యాలి ఉమా కమండలేశ్వర స్వామి ఆలయంలో ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠకు ఆనంద్ గోపాల్ దంపతులు శుక్రవారం రూ 1,00,116 విరాళం సమర్పించారు.



12,241 క్యూసెక్కుల విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం 12,241 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.40 అడుగులకు చేరింది.

గరిష్ఠం/కనిష్ఠం
41.5° / 26°

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమహేంద్రవరం	41.5	28.5
కాకినాడ	38.1	28.4
అమలాపురం	39.5	26.0

న్యూస్‌రీల్

అన్నవరం ఎస్‌ఐ శోభన్‌కుమార్ సస్పెన్షన్



ఎస్‌ఐ శోభన్ కుమార్

అన్నవరం: స్థానిక పోలీస్ స్టేషన్ సబ్‌ఇన్‌స్పెక్టర్ శోభన్‌కుమార్‌ను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ ఎస్ సతీష్‌కుమార్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. పోలీస్ స్టేషన్ నిర్వహణకు సంబంధించి అవకతవకలకు పాల్పడినట్లుగా ఫిర్యాదులు వచ్చాయి. పోలీస్‌స్టేషన్‌లో తమకు న్యాయం జరగడం లేదని పలువురు గ్రామస్థులు స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఆరోపణలపై విచారించి ఎస్‌ఐను సస్పెండ్ చేసినట్లు సమాచారం. ఎస్‌ఐపై వచ్చిన ఆరోపణలపై శాఖాపరమైన దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

వైభవంగా ప్రత్యంగిర, చండీ హోమాలు

అన్నవరం: రత్నగిరి దుర్గామాత వనదుర్గమ్మ వారికి వైశాఖ అమావాస్య, శుక్రవారం సందర్భంగా ప్రత్యంగిర, చండీ హోమాలను వైభవంగా నిర్వహించారు. అదేవిధంగా సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి, తొలిపావంచా వద్ద కనకదుర్గమ్మ వారికి లక్ష కుంకుమార్చనలు చేశారు. ఉదయం వనదుర్గమ్మకు పండితులు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ప్రత్యంగిర, చండీ హోమాలు నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు పూర్ణాహుతి జరిగింది. తరువాత నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. వేదపండితుడు యనమంద్ర శర్మ అవధాని, ఆలయ అర్చకుడు చిట్టింవాసు, వ్రత పురోహితులు దేవులపల్లి ప్రకాష్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమ క్రతువు నిర్వహించారు. 50 జంటలు రూ.750 టిక్కెట్‌తో హోమంలో పాల్గొన్నాయి. కాగా సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి, తొలిపావంచా వద్ద కనకదుర్గమ్మకు రుత్విక్కులు లక్ష కుంకుమార్చన చేశారు. ఆలయ ప్రధానార్చకుడు ఇంద్రగంటి నరసింహమూర్తి, అర్చకులు వెంకటేశ్వర్లు, పరిచారకుడు యడవిల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఏపీఆర్‌జేసీ ప్రవేశ పరీక్ష

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీల్లో ప్రవేశాల కోసం ఏపీఆర్‌జేసీ పరీక్షను రాజమహేంద్రవరంలో శనివారం నిర్వహిస్తున్నట్టు జోన్ – 2 ప్రాంతీయ విద్యా సంచాలకులు జి.నాగమణి తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంటల్ అధికారులతో ఆమె శుక్రవారం సమావేశం నిర్వహించారు. నగరంలోని ఏడు సెంటర్లలో పరీక్ష జరుగుతుందన్నారు. కన్వీనర్‌గా భూపతిపాలెం కళాశాల ప్రిన్సిపాల్ బి.రవి వ్యవహరిస్తున్నారన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయ ఏడీ ఛాయాదేవి, రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యా శాఖాధికారి ఎం.తిరుమలదాస్, అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు బిల్లులు చెల్లింపు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): జిల్లాలో ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఆసుపత్రులకు రూ.50 కోట్లు పైగా పెండింగ్ బిల్లులు విడుదలయ్యాయని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ జిల్లా కో ఆర్డినేటర్ పి.ప్రియాంక శుక్రవారం తెలిపారు. 90 ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు ఆరోగ్యశ్రీ సేవలను అందిస్తున్నాయన్నారు. కొన్ని నెలలుగా సకాలంలో బిల్లులు చెల్లించలేదంటూ కొన్నియాజమాన్యాలు ఇటీవల ఆందోళన వ్యక్తం చేశాయి. ఈనెల 16 నుంచే ఆసుపత్రుల ఖాతాలలో డబ్బులు జమవుతున్నాయని ప్రియాంక్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.368 కోట్లు విడుదల చేశారన్నారు. జిల్లాలో గతె రూ.165 కోట్లతో ఆరోగ్యశ్రీ సేవలు అందించగా ఇప్పటికే రూ.112 కోట్లు ఆసుపత్రులకు చెల్లించారన్నారు. మిగిలిన బిల్లులు వీలైనంత త్వరగా ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ఆసుపత్రుల వర్గాలు సానుకూలంగా స్పందించి ఆరోగ్య శ్రీ సేవలను కొనసాగిస్తామని హామీ ఇచ్చాయని తెలిపారు.

హెచ్‌సీఎల్ క్యాంపస్ డ్రైవ్

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం హెచ్‌సీఎల్ టెక్‌బీ డ్రైవ్ నిర్వహించారు. దీనికి జిల్లా నలుమూలల నుంచి 33 మంది హాజరు కాగా ఆరుగురు ఉద్యోగాలకు ఎంపికయ్యారని జిల్లా నైపుణ్యాధికారి ఎం.కొండలరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ హెచ్‌సీఎల్ కంపెనీ ఇంటర్ విద్యార్హతతో ఉద్యోగం కల్పించి, బిట్స్ పిలానీ వంటి విశ్వవిద్యాలయం ద్వారా పైచదువులకు వీలు కల్పించడం చాలామంచి విషయమన్నారు. ఎంసెట్ పరీక్ష కారణంగా హాజరుకాలేకపోయిన వారి కోసం త్వరలోనే మరో డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈ కంపెనీ ప్రతినిధులు, రాజకుమార్, పద్మావతి, మౌనిక పాల్గొన్నారు.

గడప గడపతో ప్రగతి అడుగులు

- పరుగులు పెడుతున్న పనులు
- ఇలా చెబితే అలా పరిష్కారం
- కలెక్టర్ల పర్యవేక్షణలో నిరంతర సమీక్షలు
- తొలి రెండు స్థానాల్లో కాకినాడ, తూర్పు గోదావరి



నాడు: అధ్వానంగా పిఠాపురం కొండప్ప వీధి రోడ్డు



నేడు: అద్దంలా మారిన కొండప్ప వీధి

సాక్షి ప్రతినిధి, కాకినాడ: గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా పల్లెలు, పట్టణాలు అనే వ్యత్యాసం లేకుండా ప్రగతి అడుగులు పడుతున్నాయి. దీంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్దేశించిన లక్ష్యం నెరవేరుతోంది. ఈ కార్యక్రమం ఫలాలు ప్రజలకు ఇప్పుడిప్పుడే అందుతున్నాయి. గత ఏడాది మే 11న ఈ కార్యక్రమానికి సీఎం శ్రీకారం చుట్టారు. ప్రతి గడపకూ వెళ్లాలి.. సమస్యలు తెలుసుకోవాలి.. పరిష్కరించాలి.. చేసిన పనులు చెప్పాలి అంటూ ఈ బాధ్యతను ప్రభుత్వం ఎమ్మెల్యేలకే అప్పగించింది. అప్పుడే ఏడాదైపోయింది. తొలి నాళ్లలో కొందరు ఎమ్మెల్యేలు నిత్యం గడప గడపకూ తిరగాలంటే మాటలా అని అనుకునే వారు. ఇప్పుడు వారందరూ కాళ్లకు బలపాలు కట్టుకు మరీ పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రజలతో మమేకమవుతూ, వారి సమస్యలు తెలుసుకుంటూ, ప్రతి సచివాలయానికి ప్రభుత్వం ఇచ్చిన రూ.20 లక్షలతో పరిష్కారాలు చూపుతూ, ఎమ్మెల్యేలు వారి మనసుల్ని చూరగొంటున్నారు.

విమర్శకుల నోళ్లు మూత పడేలా..

గడప గడపలో వచ్చిన సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు ప్రభుత్వం నిధులు కూడా మంజూరు చేయడంతో పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం సందర్భంగా చేతిలో కరపత్రం పెట్టి రావడం తప్ప ఒరిగిందేమిటంటూ విమర్శలకు దిగే వారి నోళ్లు మూత పడేలా.. ప్రభుత్వం కళ్లు చెదిరే అభివృద్ధి చేసి చూపిస్తోంది. గడప గడపలో వచ్చిన స్థానిక సమస్యలకు వారం తిరగకుండానే నిధులు మంజూరు చేస్తున్నారు. తరువాత మూడు నెలలు తిరగకుండానే పనులు పూర్తి చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో జరుగుతున్న ఈ పనుల్లో కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాలు మొదటి రెండు స్థానాల్లో ఉండగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మూడో స్థానంలో ఉంది.

పర్యవేక్షణతో పరుగులు

ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి పెట్టడంతో ఈ కార్యక్రమం ద్వారా జరుగుతున్న పనులను కలెక్టర్లు నెలలో నాలుగైదు పర్యాయాలు పర్యవేక్షిస్తూ, అధికారులను పరుగులు పెట్టిస్తున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని దాదాపు అన్ని నియోజకవర్గాల్లోనూ రోడ్లు, మంచినీటి ట్యాంకుల నిర్మాణం, సరఫరాలో లోపాలు గుర్తించి పైపులైన్ల ఏర్పాటు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను నెలకొల్పడం వంటి పనులు చకచకా చేపడుతున్నారు. ఈ పనులను పూర్తి చేయడంతో పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఏపీ ఈపీడీసీఎల్ అధికారులు తలమునకలవుతున్నారు.

జిల్లాలో గడప గడపకూ మన ప్రభుత్వం పనుల వివరాలు

శాఖ	పనులు	మంజూరైనవి	నిధులు (రూ.లక్షల్లో)	ప్రారంభమైన పనులు	పూర్తయినవి
పంచాయతీరాజ్	రోడ్లు	499	1,645.00	325	118
ఆర్‌డబ్ల్యూఎస్	డ్రైన్లు	498	1,506.95	388	100
ఈపీడీసీఎల్ విద్యుత్	లైన్లు	10	37.72	1	8
మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్	డ్రైన్లు, రోడ్లు	147	918.00	106	31
మొత్తం		1,154	4,107.93	820	257

నాడు అధ్వానంగా.. నేడు అద్దంలా..

అది పిఠాపురం నడిబొడ్డున ఉన్న కొండప్ప వీధి. పిఠాపురం రాజుగారి కోట నుంచి టౌన్ పోలీసు స్టేషన్ వరకూ కిలోమీటరు రోడ్డు. నాలుగు వార్డుల పరిధిలోని 16 వేల జనాభాకు ఇదే ప్రధాన రహదారి. రెండు దశాబ్దాలుగా ఈ రోడ్డు వేయాలని స్థానికులు చేసుకుంటున్న విన్నపాలు వినే తీరిక, ఓపిక నాటి పాలకులకు దొరకలేదు. ఇటీవల గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా అక్కడి వచ్చిన ఎమ్మెల్యే పెండెం దొరబాబుకు గుంతలు పడిన రోడ్డును ఆధునీకరించమని స్థానికులు అభ్యర్థించారు. ప్రతి సచివాలయానికీ రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన రూ.20 లక్షల్లో అవసరమైన నిధులను ఈ రోడ్డుతో పాటు మరో రెండు రోడ్లకు మంజూరు చేయించారు. గడప గడపకూ మన ప్రభుత్వం దృష్టికి సమస్య వచ్చిన రెండు నెలలు తిరగకుండానే ఈ రోడ్డును ఆధునీకరించి 20 ఏళ్ల సమస్యకు పరిష్కారం చూపించారు.

దారి చూపించారు



ఎన్నో ఏళ్లుగా మా వీధిలో రోడ్డు లేక నరకం చూస్తున్నాం. ఎంతో మందికి అనేక పర్యాయాలు చెప్పినా కంఠశోష మాత్రమే మిగిలింది. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే మా వీధిలోకి వచ్చారు. మేము రోడ్డు పరిస్థితి చూపించి ఆధునీకరణ కోసం అభ్యర్థించాం. స్పందించిన ఎమ్మెల్యే నిధులు విడుదల చేసి, రోడ్డు నిర్మించారు. ప్రభుత్వ ఆస్పత్రి తదితర పనులకు వెళ్లాలంటే ఇప్పుడు చాలా హాయిగా ఉంది.

– ముమ్మిడి శ్రీనివాసరావు, న్యాయవాది, పిఠాపురం

పేదలకు చంద్రబాబు క్షమాపణ చెప్పాలి

ఎమ్మెల్యే దొరబాబు డిమాండ్



ఎల్ఎన్ పురంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: పేదల ఆశల హరివిల్లులైన ఇళ్ల స్థలాలను శ్మశాన వాటికలుగా పోల్చిన టీడీపీ అధినేత చంద్రబాబు ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఎమ్మెల్యే పెండెం దొరబాబు డిమాండ్ చేశారు. పేదలకు ఇచ్చే ఇళ్ల స్థలం సెంటు భూమి కేవలం శవాలను కప్పెట్టడానికే సరిపోతుందంటూ చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. చంద్రబాబు తీరుకు నిరసనగా పిఠాపురం మండలం ఎల్ఎన్ పురంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శవాలపై పేలాలు ఏరుకునే వాళ్లు ఎంత పెద్ద పదవులు చేసినా వారి బుద్ధి మారదని, అందుకే చంద్రబాబు తన బుద్ధిని బహిర్గతం చేశారని విమర్శించారు. తాను సీఎంగా ఉన్నప్పుడు అర సెంటు కూడా ఇళ్ల స్థలం ఇవ్వని చంద్రబాబు ఇప్పుడు లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇస్తుంటే చూసి ఓర్వలేక నోటికొచ్చిన మాటలు మాట్లాడుతున్నారని అన్నారు. పేదలకు స్థలాలు ఇచ్చి నీడ కల్పించడానికి ప్రభుత్వం ముందుకు సాగుతుంటే, సహకరించాల్సింది పోయి వారికి ఇచ్చే భూమిని శ్మశాన వాటికగా పోల్చడం చంద్రబాబు విధానాన్ని తేటతెల్లం చేసిందన్నారు. బడుగు బలహీన వర్గాల ప్రజలను కించపరిచేలా చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు అప్రజాస్వామిక, అహంకార పూరితమైనవని దుయ్యబట్టారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబుకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు, సర్పంచ్ పడాల ఏడుకొండలు, వైఎస్సార్ సీపీ నేతలు జవ్వాది నాయుడు, ఉలవల భూషణం, నడిగట్ల చింతలరావు, గట్టి మోహనరావు, ముమ్మిడి శేఖర్, గృహ నిర్మాణ లబ్ధిదారులు, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై విశ్వాసాన్ని పెంచిన వలంటీర్లు

- ప్రజాస్వామ్య భావనకు ఈ వ్యవస్థే నిజమైన ప్రతీక
- కాకినాడలో వలంటీర్లకు వందనం ప్రారంభం
- హాజరైన ఎంపీ గీత, కన్నబాబు, ద్వారంపూడి



వలంటీర్లకు అవార్డు కింద మెగా చెక్కును అందజేస్తున్న నాయకులు



కార్యక్రమంలో పాల్గొన్న వలంటీర్లు

కాకినాడ సిటీ: ప్రజాస్వామ్య భావనకు వలంటీర్ వ్యవస్థే నిజమైన ప్రతీక అని ఎంపీ వంగా గీత అన్నారు. కాకినాడ రంగరాయ వైద్య కళాశాల ఆడిటోరియంలో జిల్లా పరిషత్, మున్సిపల్ పరిపాలన శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా స్థాయి వలంటీర్లకు వందనం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపీతోపాటు, కలెక్టర్ కృతికా శుక్లా, కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అతిథులుగా హాజరయ్యారు. సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డు పొందిన 11,273 మంది వలంటీర్లకు రూ. 11.50కోట్ల అవార్డు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా గీత మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థ పేద ప్రజలకు ప్రభుత్వంపైన, అధికార యంత్రాంగంపైన నిండు విశ్వాసం, భరోసా కల్పించిందన్నారు.

వారధిగా వలంటీర్లు

కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ గడచిన మూడేళ్లుగా ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా వలంటీర్లు అందిస్తున్న సేవలు నిరుపమానమైనవన్నారు. ప్రజలకు చేరువలో పాలనా ఫలాలు అందించాలనే లక్ష్యాన్ని వలంటీర్ వ్యవస్థ సాకారం చేస్తోందన్నారు. కుల, మత, రాజకీయ వివక్షలకు తావులేకుండా, అవినీతి రహితంగా, పారదర్శకమైన రీతిలో సంక్షేమ ఫలాలను అర్హులందరికీ అందించేందుకు దోహదమవుతోందన్నారు 10 రోజుల పాటు మండలాల వారీగా వలంటీర్ల వందనం కార్యక్రమం జరుగుతుందన్నారు.

రోజూ మీకు వందనం

ఎమ్మెల్యే కురసాల కన్నబాబు మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలను సాకారం చేస్తున్న వలంటీర్లకు రోజూ వందనం చేయాల్సి ఉందన్నారు. వలంటీర్ల వ్యవస్థ రాకతో ప్రజాప్రతినిధులు, అధికారులకు పని తగ్గిపోయిందన్నారు. ఎక్కడికివెళ్లినా ముందు ఆ ప్రాంత వలంటీర్ పేరే ప్రజలు చెబుతున్నారన్నారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ సమాజానికి సేవ చేసే అపూర్వ అవకాశం వలంటీర్లకు ఉందన్నారు. వారి సేవల వల్లే ప్రజాప్రతినిధులు, ప్రభుత్వానికి మంచి పేరు వస్తోందన్నారు.

ఆత్మీయతలో కష్టాన్ని మర్చిపోతున్నాం

కాకినాడ రూరల్ మండలం వాకలపూడి–3 వలంటీర్ రాయుడు కనకదుర్గ మాట్లాడుతూ వృత్తి పరంగా ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ప్రజలు తమ పట్ల చూపుతున్న ఆత్మీయత అన్నింటినీ మరిపిస్తోందన్నారు. తమకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వలంటీర్లందరి తరుపునా కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం అవార్డులకు ఎంపికైన వలంటీర్లను ఘనంగా సత్కరించారు. మున్సిపల్ కమిషనర్ డాక్టర్ ఆర్ మహేష్‌కుమార్, జెడ్పీ సీఈవో ఎన్‌వీవీ సత్యనారాయణ, డీఆర్‌డీఏ పీడీ కె శ్రీరమణి, అడిషనల్ కమిషనర్ సిహెచ్ నాగనరసింహారావు, కాకినాడ మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, మాజీ కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ చదువుతో ఉపాధికి బాట

- పారిశ్రామిక శిక్షణ ప్రవేశాలకు తొలి దశ నోటిఫికేషన్ విడుదల
- అడ్మిషన్లకు జూన్ 6 గడువు
- ప్రభుత్వ.. ప్రైవేట్ సంస్థల్లో 2060 సీట్లు



ఐటీఐ విద్యార్థులు

బాలాజీచెరువు(కాకినాడ సిటీ): పదవ తరగతి పూర్తి కాగానే విద్యార్థులు ఏకోర్సులో చేరాలా అంటూ ఆలోచిస్తారు. అధికశాతం మంది ఇంటర్మీడియెట్‌లో చేరతారు. కొందరు పాలిటెక్నిక్, ఐటీఐ కోర్సులకు ప్రాధాన్యమిస్తారు. పదవతరగతి పూర్తి చేయగానే త్వరితగతిన ఉపాధి పొందేందుకు వీలున్నవి ఐటీఐ కోర్సులు. సాంకేతిక నిపుణులు కూడా ఇదే విషయం చెబుతారు. సాంకేతిక కోర్సుల్లో ఇంటర్ ఒకేషనల్, పాలిటెక్నిక్ కోర్సులతో పాటు పలువురు విద్యార్థులు ఐటీఐ (ఇండస్ట్రియల్ ట్రెనింగ్ ఇన్‌స్టిట్యూట్)కు ప్రాధాన్యమిస్తున్నారు.

ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

ఐటీఐ చదివిన తర్వాత విద్యార్థులు అప్రెంటీస్ పూర్తి చేసుకుంటే 18ఏళ్లు దాటగానే పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు పొందడానికి అవకాశాలుంటున్నాయి. విద్యుత్, రైల్వే, రక్షణ, పలు ప్రభుత్వ, ప్రముఖ ప్రైవేట్‌సంస్థల్లో ఐటీఐ ఉత్తీర్ణులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయి. అయితే వీరిలో స్కిల్స్ తప్పనిసరిగా ఉండాలి. ఆయా ట్రేడుల్లో నైపుణ్యం సంపాదించిన విద్యార్థులకు ఉపాధి తప్పనిసరిగా లభిస్తుందన డంలో సందేహం లేదని ఐటీఐ వర్గాలు చెబుతున్నాయి. ఈనేపథ్యంలోనే రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి శిక్షణ సంస్థ ఇప్పుడు ఐటీఐల్లో స్కిల్ హబ్‌లు ఏర్పాటు చేస్తోంది. విద్యార్థులకు శిక్షణ ఇస్తోంది. ఉద్యోగం,ఉపాధితో పాటు స్వయం ఉపాధికి సైతం ఐటీఐ దోహదపడుతుంది.

ఏడాది,రెండేళ్ల వ్యవధితో రెగ్యులర్ కోర్సులు

ఐటీఐల్లో ఏడాది, రెండేళ్ల కాలపరిమితికి రెగ్యులర్ కోర్సులు ఉంటాయి. రెండేళ్ల కాలపరిమితితో ఎలక్ట్రీషియన్,ఫిట్టర్,ఎలక్ట్రానిక్, మెకానికల్, డ్రాఫ్ట్‌మన్ సివిల్, ఇన్‌స్ట్రుమెంటేషన్, మెకానికల్ వంటి బ్రాంచిలు ఉంటాయి. ఏడాది కాలపరిమితిలో డీజిల్ మెకానిక్, వెల్డర్,కటింగ్అండ్ సూయింగ్, కంప్యూటర్ ప్రోగ్రామ్ అసిస్టెంట్ బ్రాంచిలు ఉంటాయి. ఐటీఐల్లో చేరగోరే విద్యార్థులు తమకుఆసక్తి ఉన్న బ్రాంచిలు ఏ ఐటీఐలో ఉన్నాయో పరిశీలించుకోవాలి. దరఖాస్తుల పరిశీలన పూర్తయిన విద్యార్థులు మాత్రమే కౌన్సెలింగ్‌కు అర్హత సాధిస్తారు. అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయిన వెంటనే తరగతుల ప్రవేశానికి షెడ్యూలు విడుదల చేస్తారు. ఐటీఐ కోర్సుల్లో ప్రవేశానికి జూన్ 6వ తేదీ తుది గడువుగా ఉపాధి ..శిక్షణా శాఖ ప్రకటించింది.

డ్రోన్ టెక్నాలజీపై స్వల్ప కాలిక కోర్సు ప్రారంభం

కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో ఈ ఏడాది డ్రోన్ టెక్నాలజీపై ఆరు నెలల వ్యవధి గల కోర్సును ప్రవేశపెడుతున్నారు. 20 సీట్లు ఈ బ్రాంచిలో ఉంటాయి. వ్యవసాయం, సర్వే, షూటింగ్స్‌లో డ్రోన్ టెక్నాలజీ వినియోగం పెరిగిన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 10 ఐటీఐల్లో డ్రోన్ టెక్నాలజీ కోర్సును ప్రవేశపెట్టారు.

ఐటీఐ కోర్సుల్లో రెండేళ్ల వ్యవధి ఉన్న కోర్సులు పూర్తి చేసిన వారికి ఉన్నత చదువులకు అవకాశం ఉంది. ఐటీఐ పూర్తి చేసిన వారికి పాలిటెక్నిక్ రెండవ సంవత్సరంలో బ్రిడ్జి కోర్సు ద్వారా ప్రవేశం పొందేందుకు అవకాశం ఉంది. పాలిటెక్నిక్ పూర్తి చేసిన వారు అనంతరం బీటెక్ గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశం పొందవచ్చు. తద్వారా ఉద్యోగావకాశాలు మెరుగుపర్చుకోవడానికి కూడా ఒక చక్కని అవకాశంగా దోహదపడుతుంది.

జిల్లాలో పరిస్థితి ఇదీ

కాకినాడ జిల్లాలో ప్రభుత్వ యాజమాన్యం పరిధిలో కాకినాడ, జగ్గంపేటల్లో ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థలున్నాయి. ప్రైవేట్ యాజమాన్యం పరిధిలో 12 ఐటీఐలు ఉన్నాయి. ప్రభుత్వ ఐటీఐలలో 728, ప్రైవేట్ ఐటీఐల్లో 1,704 సీట్లు ఉన్నాయి.

త్వరగా స్థిరపడాలనుకునే వారికి మంచి అవకాశం



త్వరిత గతిన స్థిరపడాలనుకునేవారికి ఐటీఐ కోర్సులు ఉపయోగపడతాయి. ఐటీఐలో చేరగోరే విద్యార్థులు జూన్ 6వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దర ఖాస్తు పరిశీలన సమయంలో సమీప ప్రభుత్వ ఐటీఐలకు విధిగా హాజరు కావాలి. కౌన్సెలింగ్ షెడ్యూల్ వివరాలను విద్యార్థుల మొబైల్ నంబరుకు పంపిస్తాం. పదవ తరగతిలో విద్యార్థి పొందిన మార్కులు, రిజర్వేషన్ రోస్టర్ ప్రకారం అడ్మిషన్స్ ఉంటాయి.

– ఎంవీజీ వర్మ, ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల జిల్లా కన్వీనర్.

నేడు రత్నగిరి ట్రస్ట్‌బోర్డు సమావేశం



అన్నవరం: అన్నవరం సత్యనారాయణ స్వామివారి దేవస్థానం ధర్మకర్తల మండలి (ట్రస్ట్‌బోర్డు) సమావేశం శనివారం జరగనుంది. ప్రకాష్ సదన్ సత్రం దిగువనల ధర్మకర్తల మండలి సమావేశ హాలులో దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ అధ్యక్షతన సమావేశం జరుగుతుంది. ధర్మకర్తల మండలి ఏర్పాటయ్యాక తొలి సమావేశం మార్చి 27న జరిగింది. 53 రోజుల తరువాత రెండో సమావేశం జరగనుంది. దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్‌తో పాటు అధికారులు ఇందులో పాల్గొంటారు.

అజెండాలో కొన్ని అంశాలు

- రూ.8 కోట్ల వ్యయంతో చేపడుతున్న వివిధ నిర్మాణ పథకాలపై చర్చించనున్నారు.
- రూ.4.74 కోట్ల వ్యయంతో చేట్టిన సమూనా ఆలయం, ప్రసాద విక్రయ భవనం, ఇతర నిర్మాణాలపై చర్చ.
- మండలిలో ముగ్గురు సభ్యుల ఇంజినీరింగ్ కమిటీ ఈ నిర్మాణాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మిగిలిన సభ్యులు ఆమోదం తెలిపాల్సి ఉంది.
- మూడో ఘాట్‌రోడ్, సత్యగిరికి మరో రోడ్డు నిర్మాణం పనులపై కూడా చర్చించనున్నారు.
- కల్యాణ మహోత్సవాలలోతమ గోత్ర నామాలు చదవలేదని ధర్మకర్తల మండలి సభ్యులో కొంత మంది అసంతృప్తి వ్యక్తం చేసిన నేపథ్యంలో ఈ అంశం ప్రస్తావనకు వచ్చే అవకాశముందని సమాచారం.
- ఇకపై ట్రస్ట్‌బోర్డు సమావేశం రెండు నెలలకు ఒకసారి నిర్వహిస్తారనే అంశంపై స్పష్టత రానుంది.

క్లుప్తంగా

వెండి త్రిశూలం సమర్పణ



అమ్మవారికి వెండి త్రిశూలం సమర్పిస్తున్న దాతలు

పి.గన్నవరం: మండల కేంద్రమైన పి.గన్నవరం గ్రామ దేవత శ్రీ తాటమ్మ తల్లి జాతర సందర్భంగా శివాలయం వీధికి చెందిన గుడాల విజయ్ వెంకట రమణ, లక్ష్మీదుర్గ, గుడాల రవికుమార్, లక్ష్మీదుర్గ దంపతులు 1,050 గ్రాముల వెండితో చేయించిన త్రిశూలాన్ని శుక్రవారం సమర్పించారు. దీని విలువ రూ.1.05 లక్షలు ఉంటుంది.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

ఏలేశ్వరం: దొంగలు బరితెగించారు. పట్టపగలే తాళం వేసి ఉన్న ఇంట్లోకి చొరబడి భారీగా నగదు, సొత్తు అపహరించారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని చిన్నింపేట గ్రామానికి చెందిన శరకణం బాబ్జీ యర్రవరంలోని సీపీఎఫ్ కంపెనీలో పని చేస్తున్నారు. ఆయన భార్య అనసూయ గ్రామంలోని జీడిపిక్కల ఫ్యాక్టరీలో పని చేస్తోంది. రోజులానే వారిద్దరూ పనుల్లోకి వెళ్లారు. వారి పిల్లలిద్దరూ బంధువులతో కలిసి దైవదర్శనం కోసం ఇంటికి తాళం వేసి వెళ్లారు. అదే అదనుగా దొంగలు ఆ ఇంట్లోకి చొరబడి బీరువాలో ఉన్న రూ.3 లక్షల నగదు, బాబ్జీ సోదరి సత్య దాచి ఉంచమన్న సుమారు 30 తులాల బంగారం ఆభరణాలను అపహరించుకుపోయారు. పనులు ముగించుకుని తిరిగి ఇంటికి కుటుంబ సభ్యులు చోరీ జరిగినట్టు గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై జి.సతీష్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. క్లూస్ టీముతో పరిసరాలను పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

డిజిటల్ తరగతి

- ప్రభుత్వ పాఠశాలల్లో స్మార్ట్ టీవీలు, ఐఎఫ్‌పీ స్క్రీన్లు
- అన్ని పాఠశాలలకూ 4జీ ఇంటర్‌నెట్ సదుపాయం
- విప్లవాత్మక చర్యలకు ప్రభుత్వం శ్రీకారం

రాయవరం: దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే తరగతి గదులు డిజిటల్ బాట పడుతున్నాయి. ఒకప్పుడు కార్పొరేట్ పాఠశాలలకే పరిమితమనుకున్న డిజిటల్ విద్య ఇప్పుడు పేద విద్యార్థులకూ చేరువ కాబోతోంది. పాఠశాల స్థాయి నుంచే గుణాత్మక విద్యను అందించేందుకు ప్రభుత్వం పలు విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే పలు అంశాల్లో కార్పొరేట్‌ను తలదన్నేలా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దింది. ఫలితంగా పదో తరగతిలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించి, ప్రజల దృష్టిని ఆకర్షించారు. ఇదే ఒరవడితో ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ చదువులను అందుబాటులోకి తీసుకువచ్చే దిశగా సర్కారు అడుగులు వేస్తోంది.

వచ్చే విద్యా సంవత్సరంలో..

2023–24 విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ చదువులు ప్రారంభించేందుకు పాఠశాల విద్యా శాఖ ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేస్తోంది. జాతీయ, ప్రపంచ స్థాయి పోటీకి తట్టుకునేలా రాష్ట్రంలోని విద్యార్థులను తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతోంది. ఇప్పటికే 8వ తరగతి విద్యార్థులకు గత విద్యా సంవత్సరంలో బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లు ఇచ్చిన విషయం పాఠకులకు విదితమే. ఈ క్రమంలో సాంకేతిక విద్యను అన్ని తరగతులకూ అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇందులో భాగంగా ప్రాథమిక పాఠశాలల్లో 1–5 తరగతులకు స్మార్ట్ టీవీలు, ఉన్నత పాఠశాలల్లో 6–10 తరగతులకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ పానల్స్ (ఐఎఫ్‌పీ) సరఫరా చేస్తున్నారు. జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభించే సమయానికి పాఠశాలల్లో వీటిని అందుబాటులోకి తెచ్చేలా చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు.

264 స్మార్ట్ టీవీలు.. 951 ఐఎఫ్‌పీల ఏర్పాటు

ఇప్పటికే ఇంగ్లిష్ మీడియం బోధనతో మెరుగైన ఫలితాలు కనిపిస్తుండడంతో ప్రభుత్వ పాఠశాలలను డిజిటలైజ్ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకు అవసరమైన సాంకేతిక సామగ్రి పాఠశాలలకు చేరుకుంటోంది. జిల్లా వ్యాప్తంగా నాడు – నేడు తొలి విడతలో అభివద్ధి చేసిన పాఠశాలల్లో ఐఎఫ్‌పీ, స్మార్ట్ టీవీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మొత్తం 191 ప్రాథమిక పాఠశాలల్లో 264 స్మార్ట్ టీవీలు, 142 ఉన్నత పాఠశాలల్లో 951 ఐఎఫ్‌పీలు ఏర్పాటు చేస్తారు. ప్రతి 60 మంది విద్యార్థులకు ఒక స్మార్ట్ టీవీ ఏర్పాటు చేస్తూండగా, 6 నుంచి 10 తరగతులకు సెక్షన్‌కు ఒకటి చొప్పున ఐఎఫ్‌పీ ఏర్పాటు చేస్తారు. 65 అంగుళాల సైజు కలిగిన స్మార్ట్ టీవీలు, ఐఎఫ్‌పీలు సరఫరా చేస్తున్నారు. ఈ పాఠశాలల్లో 4జీ ఇంటర్నెట్ కనెక్షన్ కూడా ఏర్పాటు చేస్తారు. ఐఎఫ్‌పీని బ్లాక్ బోర్డు, వైట్ బోర్డులా కూడా వాడుకోవచ్చు. ఈ బోర్డుపై రాసిన నోట్స్‌ను సేవ్ చేయవచ్చు. ఇంటర్నెట్ కనెక్షన్ ద్వారా దీనిని కంప్యూటర్ మాదిరిగా వినియోగించుకునే వీలు కూడా ఉంటుంది. అలాగే ఫోన్ లేదా ట్యాబ్‌లో ఉన్న మెటీరియల్‌ను కూడా స్క్రీన్‌పై చూపించే అవకాశముంటుంది. తరగతి గదిలోనే విద్యార్థులకు ప్రపంచాన్ని చూపించేలా శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. వీటిని ఎలా ఉపయోగించాలనే విషయమై ఉపాధ్యాయులకు ఇటీవలే శిక్షణ కూడా ఇచ్చారు. స్మార్ట్ టీవీలు, ఐఎఫ్‌పీల ఏర్పాటుకు అవసరమైన విద్యుదీకరణ, ఎర్తింగ్, ఆండ్రాయిడ్ బాక్స్, ల్యాన్ కేబుల్ వంటి మౌలిక వసతుల కల్పనలో ఆయా ప్రధానోపాధ్యాయులు నిమగ్నమయ్యారు.



అమలాపురంలోని ఒక ప్రైవేటు పాఠశాలలో ఐఎఫ్‌పీ పనితీరును పరిశీలిస్తున్న విద్యా శాఖ అధికారులు

డిజిటల్ విప్లవం



ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యమిస్తోంది. ముఖ్యంగా సాంకేతిక విద్యను విద్యార్థులకు చేరువ చేయడం, పేద విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ పాఠశాల్లో ఇటువంటి వసతులు కల్పించడం గర్వించదగ్గ విషయం. భవిష్యత్తులో ప్రభుత్వ పాఠశాలలు మరింత బలోపేతమవుతాయి.

– ఎం.కమలకుమారి, అదనపు ప్రాజెక్టు కో ఆర్డినేటర్, సమగ్ర శిక్షా, అమలాపురం

మరిన్ని ఉత్తమ ఫలితాలు



ఇప్పటికే ప్రభుత్వం బైజూస్ కంటెంట్ ట్యాబ్‌లు ఇచ్చింది. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో స్మార్ట్ టీవీలు, ఐఎఫ్‌పీలను ప్రవేశపెట్టడం ద్వారా సాంకేతిక విద్యా విప్లవానికి శ్రీకారం చుడుతోంది. భవిష్యత్‌లో విద్యాపరంగా మరిన్ని ఉత్తమ ఫలితాలు వస్తాయనడంలో ఏమాత్రం సందేహం లేదు.

– పినపాటి నిర్మలాకుమారి, ఉపాధ్యాయిని, ఎంపీపీ స్కూల్, వెదిరేశ్వరం, రావులపాలెం మండలం

విద్యుత్ షాక్‌తో ఇద్దరి మృతి

- వాకపల్లి జాతరలో బాలుడు
- దేవరపల్లిలో యువకుడు

ప్రత్తిపాడు రూరల్/రావులపాలెం: వేర్వేరు ఘటనల్లో ఒక బాలుడు, మరో యువకుడు విద్యుత్ షాక్‌తో ప్రాణాలు కోల్పోయారు. కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం ఎస్.పైడిపాలకు చెందిన ఈగల ప్రవీణ్ (16) ఏడో తరగతి చదువుతున్నాడు. అమ్మమ్మగారి ఊరైన ప్రత్తిపాడు మండలం వాకపల్లిలో శ్రీ మహాలక్ష్మి అమ్మవారి జాతరకు వచ్చాడు. శుక్రవారం జాతరలో ఓ విద్యుత్ స్తంభాన్ని ఓ వ్యాన్ ఢీకొంది. ఈ ప్రమాదంతో 11 కేవీ విద్యుత్ వైర్లు ఒక్కసారిగా తెగి ప్రవీణ్‌పై పడ్డాయి. తీవ్రమైన షాక్‌కు గురైన ప్రవీణ్‌ను వెంటనే ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ప్రవీణ్ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. మృతుడికి తల్లిదండ్రులు, తమ్ముడు ఉన్నారు.

మరో ఘటనలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం దేవరపల్లి అంబేడ్కర్ నగర్‌కు చెందిన చాటగళ్ళ సురేష్ (27) గురువారం రాత్రి విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. పక్క ఇంట్లో కరెంటు సరఫరా నిలిచిపోతే చూడటానికి వెళ్లిన అతడు షాక్‌కు గురై, మృతి చెందాడు. సురేష్ మృతదేహానికి కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి శుక్రవారం నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ గన్నవరపు వెంకట్రావు, చాంబర్ అధ్యక్షుడు కర్రి నాగిరెడ్డి తదితరులు ఉన్నారు.

4న అంతర్వేదిలో సప్తనదీ తీర్థ మహాజ్యేష్ఠాభిషేకం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో వచ్చే నెల 4న స్వామి వారికి సప్తనదీ తీర్థ మహాజ్యేష్ఠాభిషేకం నిర్వహిస్తున్నారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. ఆ రోజున జ్యేష్ఠ పూర్ణిమ, జ్యేష్ఠా నక్షత్రాన్ని పురస్కరించుకుని స్వామివారి మూలవిరాట్టుకు గంగ, యమున, గోదావరి, సరస్వతి, నర్మద, సింధు, కావేరీ నదుల జలాలతో మహా జ్యేష్ఠాభిషేకం నిర్వహిస్తామని వివరించారు. ఇందులో పాల్గొనదలిచే భక్తులు రూ.400 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

సమన్వయంతోనే ప్రమాదాల నివారణ

- ఆర్‌డీఓ వసంతరాయుడు
- గ్యాస్ ప్రమాదాలపై మాక్ డ్రిల్

అల్లవరం: చమురు సంస్థలు కార్యకలాపాలు నిర్వహిస్తున్న ప్రాంతాల్లో నిక్షేపాలు లీకై ఊహించని ప్రమాదాలు జరిగినప్పుడు అధికారులు సమన్వయంగా ఎదుర్కోవాలని అమలాపురం ఆర్‌డీఓ వసంతరాయుడు అన్నారు. ఓఎన్‌జీసీ ఓడలరేవు టెర్మినల్‌లో ఈస్టన్ ఆఫ్‌షోర్ అసెట్ ఆధ్వర్యాన గురువారం మాక్ డ్రిల్ నిర్వహించారు. సర్పంచ్ మల్లాడి మంగాయమ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఆర్‌డీఓ వసంతరాయుడు, అసెట్ జీఎం సుభాష్ పాల్గొన్నారు. తొలుత సముద్ర లోతు జలాల్లో నుంచి 14 అంగుళాల వ్యాసం కలిగిన పైపుల నుంచి టెర్మినల్‌కు 50 కేజీల ఒత్తిడితో గ్యాస్ లీకై, అగ్నిప్రమాదం జరిగినప్పుడు తీసుకునే చర్యలపై రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక, వైద్య శాఖల చెందిన సిబ్బంది మాక్ డ్రిల్ నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు మంటలు వ్యాపించకుండా భద్రతా చర్యలు తీసుకోవడం, పరిసర ప్రాంతాల్లో మొబైల్ ఫోన్ వాడకుండా అవగాహన కల్పించడం, గ్యాస్ లీకై పరిసర ప్రాంతాలకు వ్యాపించకుండా వాటరింగ్ వంటి ఎక్సర్‌సైజ్‌లను అగ్నిమాపక సిబ్బంది నిర్వహించారు. ప్రమాద సమయంలో సిబ్బంది ప్రాణాపాయ స్థితిలో ఉంటే వైద్యులు ఎలా స్పందించాలి, క్షతగాత్రులను ఎలా రక్షించుకోవాలనే అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే ప్రమాదం జరిగిన ప్రాంతంలో శాంతి భద్రతల అదుపు, ప్రమాద స్థలం నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంపై ఎస్సై శ్రీనునాయక్ ఆధ్వర్యాన అవగాహన కల్పించారు. అన్ని శాఖల సిబ్బందీ సమన్వయంతో పని చేస్తూ ఓఎన్‌జీసీ అధికారులు లీకేజీని నియంత్రించారు. ప్రమాద సమయంలో గ్రామస్తులు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తే నష్టాన్ని నివారించవచ్చని మాక్ డ్రిల్ ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం టెర్మినల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకుడు మల్లాడి ఉమా మాట్లాడుతూ, ఓడలరేవులో 20 సంవత్సరాల క్రితం నిర్మించిన పైపులైన్ పనితీరును పరిశీలిస్తున్నారా, లేదా అని ఓఎన్‌జీసీ అధికారులను ప్రశ్నించారు. 25 సంవత్సరాల పాటు సేవలందించేలా పైపులైన్‌ను తయారు చేశారని, దీనిపై ప్రతి రోజూ పర్యవేక్షణ ఉంటుందని జీఎం సుభాష్ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సాంబశివ ప్రసాద్, ఫైర్ ఆఫీసర్ ఎస్.నాగేశ్వరరావు, మెరైన్ ఎస్సై విలియమ్స్, కాలుష్య నియంత్రణ అధికారి కరుణారేఖ, ఆర్ఐ దుర్గా శ్రీనివాస్, అగ్నిమాపక సిబ్బంది, ఓఎన్‌జీసీ అధికారులు పాల్గొన్నారు.



మాక్ డ్రిల్‌లో ప్రసంగిస్తున్న ఆర్‌డీఓ వసంతరాయుడు



గ్యాస్ లీకేజీని అదుపు చేస్తున్న ఓఎన్‌జీసీ అగ్నిమాపక సిబ్బంది



గాయపడిన వారిని అంబులెన్స్‌లోకి ఎక్కిస్తూ..

‘జయలక్ష్మి’ బాధితులకు తీపి కబురు

- జూలై నాటికి సుమారు రూ.100 కోట్ల చెల్లింపు
- రుణాలు చెల్లించకపోతే క్రిమినల్ కేసులకూ సిద్ధం
- ‘సాక్షి’తో పాలకవర్గం చైర్మన్ గంగిరెడ్డి త్రినాథరావు



గంగిరెడ్డి త్రినాథరావు

కాకినాడ రూరల్: ఖాతాదారుల సొమ్ములను పక్కదారి పట్టించి, బోర్డు తిప్పేసిన జయలక్ష్మి సొసైటీ బాధితులకు న్యాయం చేసే దిశగా నూతన పాలకవర్గం అడుగులు వేస్తోంది. సొసైటీ సభ్యులు మహాజన సభ ద్వారా నూతన పాలకవర్గాన్ని ఏర్పాటు చేసుకోవడంతో వారు సర్పవరం జంక్షన్‌లోని మెయిన్ బ్రాంచి నుంచి కార్యకలాపాలు సాగిస్తున్నారు. సుమారు 20 వేల మంది సభ్యులున్న ఈ సొసైటీకి 2 వేల మంది రుణగ్రహీతలు ఉండగా సుమారు రూ.700 కోట్ల వరకూ రావాల్సి ఉంది. సొసైటీ కార్యాలయంలో పాలకవర్గ చైర్మన్ గంగిరెడ్డి త్రినాథరావు శుక్రవారం ‘సాక్షి’తో ముచ్చటించారు. ఇప్పటి వరకూ రూ.2.5 కోట్లు వసూలైందని, ఒకటి రెండు నెలల్లో విశాఖపట్నం ఎంవీపీ కాలనీలోని బ్రాంచి నుంచి రూ.70 కోట్ల వరకూ వసూలు కానుందని చెప్పారు. అలాగే, రాజమహేంద్రవరం బ్రాంచి నుంచి రూ.40 కోట్ల వరకూ రానున్నాయన్నారు. ఈ రెండు బ్రాంచిల నుంచి వచ్చే సుమారు రూ.100 కోట్లను జూలై నాటికి బాధిత డిపాజిటర్ల ఎస్‌బీ ఖాతాలకు జమ చేస్తామని చెప్పారు. రుణాలు తీసుకున్న వారిలో రూ.300 కోట్లకు సంబంధించి పత్రాలు, గ్యారంటీ ఉన్నాయని, రూ.400 కోట్లను మాత్రం గత పాలకవర్గం చైర్మన్, వైస్ చైర్మన్, ఈడీలు పక్కదారి పట్టించారని, దీంతో వారికి సంబంధించిన 64 ఆస్తులను సీబీసీఐడీ అధికారులు సీజ్ చేశారని త్రినాథరావు వివరించారు. రుణాలు తీసుకున్నవారు సకాలంలో చెల్లించాల్సిందిగా నోటీసులు ఇస్తున్నామని, ఇప్పటి వరకూ 1,450 మందికి నోటీసులు ఇచ్చామని తెలిపారు. వారు స్పందించకపోతే క్రిమినల్ కేసులకు కూడా వెనకాడబోమని స్పష్టం చేశారు. మరోవైపు జయలక్ష్మి బ్యాంక్‌ను టేకోవర్ చేసుకునేందుకు కోయంబత్తూరుకు చెందిన త్యాగరాజన్ గ్రూప్‌తో రాజమహేంద్రవరంలోని ఒక ఫైనాన్స్ కంపెనీ ద్వారా చర్చలు జరిపామని చెప్పారు. గుజరాత్, మరో ప్రాంతానికి చెందిన కంపెనీలు కూడా తమతో కలిసి బ్యాంకింగ్ కార్యకలాపాలు నిర్వహించేందుకు ముందుకు వస్తున్నాయని త్రినాథరావు తెలిపారు. ఆయనతో పాటు కో ఆపరేటివ్ లీగల్ అడ్వయిజర్ ప్రసాదమూర్తి, డైరెక్టర్లు గౌరీశంకర్, చింతా సుబ్బారావు, జాన్ బాషా ఉన్నారు.

పెద్దల కళ్లుగప్పి పెళ్లి

- కుటుంబ సభ్యులకు తెలియడంతో ఆందోళన
- బాలిక ఆత్మహత్య
- పురుగు మందు తాగిన ప్రేమికుడు



చికిత్స పొందుతున్న ప్రేమికుడు సూర్యారావు

పెరవలి: ఆమె వయస్సు 14 ఏళ్లు.. అతడికి 22.. ఇద్దరూ గాఢంగా ప్రేమించుకున్నారు. వయోభేదాన్ని పట్టించుకోకుండా పెద్దలకు తెలియకుండా పెళ్లి కూడా చేసేసుకున్నారు. చివరకు గుట్టు రట్టయ్యింది. పరిస్థితిని ఎదుర్కొనే మానసిక పరిపక్వత లేకపోవడంతో ఏం జరుగుతుందోనని ఆ బాలిక భయాందోళనకు గురై, ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలిసిన ప్రేమికుడు కూడా ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టాడు. పెరవలి మండలం అన్నవరప్పాడు గ్రామంలో ఈ విషాద సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం .. గ్రామానికి చెందిన బాలిక (14) ఇటీవల తొమ్మిదో తరగతి పరీక్షలు రాసింది. ఆమె, అదే గ్రామానికి చెందిన ఆకుమర్తి సూర్యారావు (22) కొన్నాళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో వీరిద్దరూ గురువారం ఎవరికీ తెలియకుండా వివాహం చేసుకుని ఇంటికి వచ్చేశారు. విషయం ఎవరికీ తెలియకుండా జాగ్రత్త పడ్డారు. శుక్రవారం ఉదయం ఇంట్లో పని చేస్తుండగా ఆ బాలిక మెడలో మంగళసూత్రం బయట పడింది. గమనించిన తల్లి అదేమిటని ఆ బాలికను నిలదీసింది. విషయం తెలియడంతో చుట్టుపక్కల మహిళలు కూడా చిన్న వయస్సులో ఇదేం పనంటూ మందలించారు. విషయం సూర్యారావు వైపు పెద్దల దృష్టికి కూడా వెళ్లింది. అయితే, అప్పటికి ఆ విషయం బాలిక తండ్రికి తెలియలేదు. దీంతో తండ్రి, పెద్దలు వస్తే ఏం జరుగుతుందోనని ఆ బాలిక ఆందోళన చెందింది. ఈ నేపథ్యంలో ఉదయం 11 గంటల సమయంలో బాత్‌రూముకు వెళ్లి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయం తెలియడంతో మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఆమె ప్రియుడు సూర్యారావు పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని హుటాహుటిన తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అతడు ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలియడంతో పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. బాలిక ఏవిధంగా చనిపోయిందో విచారణ చేపట్టారు. ఈ సంఘటనపై పెరవలి ఎస్సై ఎం.సూర్యభగవాన్ కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం బాలిక మృతదేహాన్ని తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాలిక తల్లిదండ్రులకు ఇద్దరు కుమార్తెలు. వారిని ఎంతో అల్లారుముద్దుగా పెంచుకున్నామని, తాము పడుతున్న కష్టం వారు పడకూడదనే ఉద్దేశంతో కుమార్తెను చదివిస్తున్నామని, ఇంతలోనే ఇలా జరిగిందంటూ ఆమె తల్లిదండ్రులు బోరున విలపించారు. ఈ సంఘటనతో సూర్యారావు తల్లిదండ్రులు కూడా కన్నీరుమున్నీరవుతున్నారు.

పేదలకు మంచి జరగడం చంద్రబాబుకు ఇష్టం లేదు



ఆవాల రాజేశ్వరి

సామర్లకోట: పేద ప్రజలకు మంచి జరగడం చంద్రబాబు ఇష్టం ఉండదనే విషయం మరోసారి స్పష్టమైందని రాష్ట్ర అయ్యారక కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి అన్నారు. తన నివాసంలో శుక్రవారం ఆమె విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను సమాధులతో పోల్చడం అన్యాయమని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పట్టణ పరిధిలోని వారికి సెంటు, గ్రామీణ ప్రాంతాల్లోని వారికి సెంటున్నర భూమి ఇచ్చారని, వాటిలో లబ్ధిదారులు సంతోషంగా ఇళ్ల నిర్మించుకుని, గృహప్రవేశాలు చేస్తుంటే ఆ స్థలాలు శవం పూడ్చడానికి సరిపోతుందంటూ కించపరచడం దారుణమని మండిపడ్డారు. చంద్రబాబు పాలనలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వలేకపోయారని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో అనేక మంది ఇళ్ల స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నామంటూ ఫిర్యాదు చేశారని అన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తే, చంద్రబాబు తట్టుకోలేకపోతున్నారని రాజేశ్వరి దుయ్యబట్టారు. ప్రతి నియోజకవర్గంలోనూ ప్రత్యేకంగా జగనన్న గ్రామాలు ఏర్పడుతున్నాయని తెలిపారు. జగనన్న కాలనీలకు వచ్చి, పేదలు నిర్మించుకుంటున్న ఇళ్లు చూడాలని సూచించారు. దేశంలో రికార్డు స్థాయిలో పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో పాటు.. లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేందుకు ఆర్థిక సహాయం చేస్తున్న విషయాన్ని ఆమె గుర్తు చేశారు. గతంలో పేద విద్యార్థుల కోసం ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిషు మీడియం ప్రవేశపెడితే చంద్రబాబు అడుకున్నారని అన్నారు. వీటన్నింటిని బట్టి పేదలంటే చంద్రబాబుకు చులకన భావం ఉందన్న విషయం స్పష్టమవుతోందని రాజేశ్వరి పేర్కొన్నారు. విలేకర్ల సమావేశంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, వైఎస్సార్ యూత్ పట్టణ అధ్యక్షుడు దేగల భాస్కరరావు కూడా పాల్గొన్నారు.

నడి రోడ్డుపై.. అపస్మారక స్థితిలో..

- గాయాలతో కనిపించిన బాలిక
- ఆసుపత్రిలో చేర్చిన కౌన్సిలర్



గాయపడిన బాలిక

అమలాపురం టౌన్: పట్టణంలో ఓ బాలిక గాయాలు, తీవ్ర రక్తస్రావంతో పడి ఉండటం కలకలం రేపింది. పట్టణంలోని గాంధీనగర్ రోడ్డుపై శుక్రవారం మధ్యాహ్నం 11 ఏళ్ల బాలిక గాయాలు, తీవ్ర రక్త స్రావంతో పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. మిట్ట మధ్యాహ్నం కావడంతో బాలిక పడి ఉండటాన్ని వారు కొంత ఆలస్యంగా గమనించారు. ఘటనా స్థలానికి ఎదురుగా నివసిస్తున్న మున్సిపల్ కౌన్సిలర్ కొల్లాటి దుర్గాబాయి బాధిత బాలికను దగ్గరలోని ఓ ఆసుపత్రికి తరలించి, అత్యవసర వైద్యం అందించే ఏర్పాట్లు చేశారు. అప్పటికే అపస్మారక స్థితిలోకి వెళ్లిన ఆ బాలిక పరిస్థితి కొంత ఆందోళనకరంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలియడంతో పట్టణ సీఐ ద్వారంపూడి దుర్గాశేఖర రెడ్డి కిమ్స్ ఆస్పత్రికి చేరుకున్నారు. అప్పటికే అక్కడకు చేరుకున్న బాలిక కుటుంబ సభ్యులను విచారించారు. ఘటనా స్థలాన్ని కూడా పట్టణ ఎస్సై ప్రభాకరరావుతో కలసి పరిశీలించారు. పట్టణంలోని మైపాలవీధికి చెందిన బాలికగా ఆమెను గుర్తించారు. ఆమె సైకిల్ తొక్కుకుంటూ గాంధీనగర్ రోడ్డుకు వచ్చి, అనుమానాస్పద స్థితిలో గాయాల పాలైంది. ఆమె మూర్ఛ వ్యాధితో బాధ పడుతున్నట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఘటనా స్థలంలో ఆమె సైకిల్‌లో ఆ బాలిక చున్నీ చిక్కుకుని ఉంది. ఆమె శరీరంపై కొన్నిచోట్ల గాయాలవడం, ఆమె మల ద్వారం నుంచి మలం, రక్తం రావడంతో స్థానికులు ఈ ఘటనపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. బాలిక పక్కటెముకలు కూడా విరిగిపోయినట్టు పోలీసులు గుర్తించారు. ఆమెకు, సైకిల్‌కు కుడివైపు మాత్రమే గాయాలు, డ్యామేజీలు ఉండటంతో ఏదైనా గుర్తు తెలియని వాహనం ఢీకొని ఉంటుందని, లేదా ఆమె స్వయంగా ప్రమాదానికి గురై ఉంటుందనే దిశగా దర్యాప్తు చేస్తున్నామని సీఐ దుర్గాశేఖరరెడ్డి చెప్పారు. ఘటనా స్థలం వద్ద సీసీ ఫుటేజీలను కూడా పోలీసులు సేకరిస్తున్నారు.